

రత్నమ్మను సత్కరిస్తున్న బింగి నరేందర్‌గౌడ్

33 గంటల నిరవధిక పాటల కచేరీ

● వండర్ బుక్ రికార్డ్స్‌లో నమోదు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): గాయని పంట రత్నమ్మ 33 గంటల నిరవధిక పాటల కచేరీతో రికార్డు సృష్టించారు. కడప జిల్లాకు చెందిన రత్నమ్మ 33 గంటలపాటు ఒకేసారి తెలుగు, హిందీ భాషల్లో విభిన్న రాగాలతో పాటలు పాడుతూ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కళాభారతి సిటీకల్చరల్ సెంటర్ వేదికలో శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు జరిగింది.

ఈ సందర్భంగా రికార్డ్ అధినేత బింగి నరేందర్‌గౌడ్, ప్రతినిధులు రికార్డు నమోదిత సర్టిఫికెట్‌ను ఆదివారం సాయంత్రం జరిగిన అభినందనసభలో రత్నమ్మకు అందజేసి ప్రశంసించారు.

బీసీ కులగణన, ఫీజు బకాయిలు చెల్లించాలంటూ

20న కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాల ముట్టడి

రాంనగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన, ఫీజు బకాయిల చెల్లించాలంటూ బీసీ సంక్షేమ, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనే నిబంధనతో సంబంధం లేకుండా బీసీలకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 4,500 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. బీసీ కులగణనను వెంటనే చేపట్టి అన్ని కులాలకు సమాన వాటా కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి. అంజి, నాయకులు ర్యాగ రమేష్, మల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బాలయ్య ముదిరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీ అసంఘటిత కార్మిక సంఘం

రాష్ట్ర అధ్యక్షుడిగా బాలయ్య ముదిరాజ్

రాంనగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం అసంఘటిత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యానగర్‌కు చెందిన బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు చిక్కుడు బాలయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. ఆదివారం విద్యానగర్‌లో జరిగిన బీసీ అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న బీసీ కార్మికుల కోసం కృషి చేస్తానన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో

21న కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

రాంనగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న ట్యాంక్‌బండ్‌పై కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి నాయకులు బి.ఊర్మిళ, పద్మావతి, స్వప్న, దానకర్ణచారి, ఎం.లక్ష్మణ్, రాజు ముదిరాజ్, అనిల్ పాల్గొన్నారు.

సామాజికాంశాలను ప్రతిబింబించిన 'హరివిల్లు'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): హరివిల్లు తెలుగు గజళ్ళ పుస్తకంలో సామాజికాంశాలు స్పష్టంగా చెప్పారని సినీ నిర్మాత కె. రవిశంకర్ అన్నారు. త్యాగరాయగానసభలో కల్యాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కవి నోరి రఘురామమూర్తి రచించిన హరివిల్లు పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని రవిశంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి గజల్ అర్థవంతంగా ఉందన్నారు. కార్యక్రమంలో కవి బిక్కి కృష్ణ, శ్రీనివాస్, విజయలక్ష్మిపండిట్, జల్ది విద్యాధర్‌రావు, వీడీ రాజగోపాల్, మల్లీశ్వరి, రాధాకుసుమ, హేమకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ పుస్తకం పంపిణీ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సమయాన్ని వినియోగించుకుంటూ పోటీపరీక్షలు రాయాలని విన్నర్స్ పబ్లికేషన్స్ అధినేత ప్రసన్న హరికృష్ణ అన్నారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో పోటీపరీక్షల అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ పుస్తకాన్ని పంపిణీ చేసే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైలులో గుండెపోటుతో విశ్రాంత ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న విశ్రాంత ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు చెందిన దేవేంద్రకుమార్ పరోవర్(70) విశ్రాంత ఉద్యోగి. జబల్‌పూర్ - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బెంగళూరు వెళ్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఆయనకు గుండె పోటు వచ్చింది. రైలు స్టేషన్‌లో ఆగేసరికి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ జి. రవికుమార్ తదితరులు

క్రిస్టియన్ ఉద్యమకారులకు

250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న క్రిస్టియన్ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. ఇంటి స్థలంతోపాటు ఇళ్లు నిర్మించుకోవడానికి ఒక్కొక్క ఉద్యమకారుడికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం చేయాలని, ప్రతినెల రూ. 10 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ఆదివారం బర్కత్‌పురలో క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది క్రిస్టియన్‌లు భాగస్వాములయ్యారని, వారిని ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీలు మల్లు రవి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ ఎం. కోదండరాం, సినీ నటుడు బాబు మోహన్, బిషప్ భాస్కర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



దోమలగూడ గగన్‌మహల్‌లో ఏర్పాటు చేసిన మండపంలో పూజ నిర్వహించిన ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ



గోల్నాక జైస్వాల్ గార్డెన్ కాలనీలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రంగానగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

వినాయక మండపాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమాలు

ముషీరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గాల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన పార్వతీపుత్రుడు పూజలందుకుంటున్నాడు. ఆదివారం మండపాల్లో పలు పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు. కొన్ని మండపాల వద్ద అన్నదానం చేశారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట, జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న బాలికలు



బర్కత్‌పురలో అన్నదాన కార్యక్రమంలో సంఘ సేవకుడు రాగిఫణి ప్రవీణ్‌కుమార్ తదితరులు



రాంనగర్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న ఈస్ట్‌జోన్ డీసీపీ జోగుల నర్సయ్య, నల్లకుంట సీఐ జగదీశ్వర్



గాంధీనగర్‌లో వినాయక మండపంలో పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్



గోల్నాక శాంతినగర్‌లో పూజ నిర్వహించిన కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



బండమైసమ్మనగర్‌లో మండపంలో పూజలో ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్



దోమలగూడ తాళ్లబస్తీలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ టి. రవీందర్



నల్లకుంటలో మండపంలో నాట్యం చేసిన చిన్నారిని సత్కరిస్తున్న ప్రొఫెసర్ అరుణ సమ్రత్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్



నల్లకుంట టీఆర్‌టీ క్వార్టర్స్‌లో గణనాథుడికి పూజ చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహేష్‌కుమార్ తదితరులు



బాగ్‌అంబర్‌పేట గంగాబౌలిలో పూజలో పాల్గొన్న మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ తదితరులు



కాచిగూడలో పూజ నిర్వహించిన బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి



గోల్నాక కృష్ణానగర్‌లో వినాయక మండపంలో పూజ నిర్వహించిన మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిడీపీరెడ్డి



నాగమయ్యకుంటలో గణనాథుడి పూజలో మాజీ కార్పొరేటర్ వెంకట్‌రెడ్డి తదితరులు





రాంనగర్, భోలక్‌పూర్‌లో మండపాల్లో గణనాథుడికి పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు ఎం.నగేష్ ముదిరాజ్, ముఠా జైసింహ తదితరులు



రాంనగర్ లక్ష్మమ్మ పార్కు వద్ద వినాయక మండపంలో పూజలో పాల్గొన్న యూనిఫైడ్ యూత్ అసోసియేషన్ సభ్యులు



చిక్కడపల్లిలో పూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

● కమలానంద భారతి స్వామీజీ



గోరక్ష మహాపాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమలానంద భారతి స్వామీజీ తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ విజ్ఞప్తి చేశారు. గోవులను సంరక్షించుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అన్నారు. ఆదివారం కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్‌లో అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో భక్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న గో రక్ష మహాపాదయాత్ర పోస్టర్‌ను కమలానంద భారతి స్వామీజీ ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణకు గో రక్ష మహాపాదయాత్ర ఎంతో దోహదపడుతుందన్నారు. గోవులను రక్షించుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. గో సంతతిని కాపాడుకోవాలని కోరారు.

27 నుంచి గో రక్ష మహాపాదయాత్ర

ప్రముఖ సినీ హీరో తల్వార్ సుమన్ మాట్లాడుతూ.. సైనికులు, పోలీసులు, డాక్టర్లు క్షేమంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రాణాలను కాపాడుతున్న వైద్యులకు రక్షణ లేకుండా పోతుందని, పశ్చిమ బెంగాల్ ఘటన ఇందుకు నిదర్శనమన్నారు. గోవులను బతికించుకోవాలని కోరారు.

గో రక్ష మహాపాదయాత్ర నిర్వాహకుడు బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి 2025 మార్చి 27 వరకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గో రక్ష మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 రాష్ట్రాలు, 4,900 కిలోమీటర్లను ఆరు నెలల్లో ఈ యాత్ర పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయరావు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, బీజేపీ నాయకుడు నందకిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ పేరుతో అక్రమ వసూళ్లు

బర్కత్‌పురా సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అబుదాబిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నిర్వహిస్తున్నామని నమ్మించి మోసం చేసిన ఓ సంస్థ నిర్వాకం ఆదివారం వెలుగులోకి వచ్చింది. కాచిగూడ సీఐ చంద్రకుమార్ తెలిసిన వివరాల ప్రకారం.. అబుదాబిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నిర్వహిస్తున్నామని టంగుటూరి రామకృష్ణ, పి. మల్లికార్జున్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికి స్పందించిన పలువురు తాము మహాసభలో పాల్గొంటామని కాచిగూడకు చెందిన లోటస్ హాలిడే సంస్థను సంప్రదించారు. మహాసభలో పాల్గొనే ఒక్కొక్కరి నుంచి విమాన టికెట్‌కు రూ. 87,000, సభ్యత్వానికి రూ. 2,500, మహాసభ ఎంట్రీ ఫీజు 5 వేల రూపాయలు వసూలు చేశారు. మహాసభలో పాల్గొనేవారు శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లగా.. ఇదంతా బోగస్ అని తేలింది. దాంతో బాధితులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టంగుటూరి రామకృష్ణ, పి. మల్లికార్జున్‌తోపాటు లోటస్ హాలిడే సంస్థ యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాధితులు చాలామంది ఉన్నట్లు సమాచారం.

'తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించం'

బర్కత్‌పుర, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఈ.టి.నర్సింహ హెచ్చరించారు. చరిత్రను వక్రీకరిస్తూ వాస్తవాలను దాచిపెట్టేందుకు బీజేపీ చేస్తోన్న కుట్రలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, చందూనాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించేందుకు ఈనెల 17 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేటలో

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- **ఎన్టీఆర్ స్టేడియంలో నాలుగు నీటి కొలనులు**
- **అంబర్‌పేటలో అలీకేఫ్ చౌరస్తా-ఎస్టీపీ రోడ్‌లో మూడు నీటి కొలనులు**
- **ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు అదనంగా సిబ్బంది**

రాంనగర్/కవాడిగూడ సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో గణేశ్ నిమజ్జనానికి జీహెచ్ఎంసీ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, జల మండలి శాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల్లో ఆదివారం నాటికి 60 శాతం నిమజ్జనానికి తరలివెళ్లాయి. మిగిలిన 40 శాతం విగ్రహాలను ఈనెల 17న నిమజ్జనానికి తరలించనున్నారు. మూడు నుంచి ఎనిమిదిఫీట్ల లోపు, మూడు ఫీట్లు దాటిన విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఎన్టీఆర్ స్టేడియంలో



ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నీటి కొలను, క్రేన్లు

రెండు బేబీ ప్లాంట్లు, రెండు నీటి కొలనులు, క్రేన్లను ఏర్పాటు చేశారు. ప్రతీ నీటి కొలను వద్ద పదిమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఐదు ఫీట్ల లోపు విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి ఎస్టీపీ రోడ్డులో మూడు నీటి కొలనులు, మూడు క్రేన్లను ఏర్పాటు చేశారు.

బందోబస్తు..

సెంట్రల్ జోన్‌లో ముషీరాబాద్ పీఎస్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ఎస్ఐలు, సిబ్బందితోపాటు అదనంగా రెండు వందల మందిని, గాంధీనగర్ పీఎస్ పరిధిలో ప్రస్తుతం ఉన్న సిబ్బందితోపాటు 160 మందిని అదనంగా, చిక్కడపల్లి పీఎస్ పరిధిలో ప్రస్తుతం ఉన్న సిబ్బందితోపాటు అదనంగా 160 మందిని బందోబస్తుకు ఏర్పాటు చేశారు. దోమలగూడలో స్టేషన్ సిబ్బందితోపాటు మరో వందమందిని నియమించారు. ఈస్ట్ జోన్ పరిధిలోని నల్లకుంట పీఎస్‌లో ప్రస్తుతం ఉన్న 120 మందితోపాటు అదనంగా 55 మందిని, కాచిగూడలో స్టేషన్ సిబ్బంది 140 మందితోపాటు అదనంగా 80 మంది పోలీసులను, అంబర్‌పేటలో ప్రస్తుతం ఉన్న సిబ్బందితోపాటు అదనంగా 174 మందిని బందోబస్తుకు ఏర్పాటు చేశారు.

ర్యాలీలో డీజేలకు అనుమతి లేదు



గణేశ్ నిమజ్జన ర్యాలీలో డీజేలకు అనుమతి లేదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఒక్కో మండపానికి బందోబస్తుకు ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేస్తున్నాం. నిమజ్జన వేడుకలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తాం. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తాం. నిమజ్జన ర్యాలీ రూట్లలో రూఫ్‌టాప్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. నిమజ్జనానికి తరలించే విగ్రహాలను వాహనాలపైకి ఎక్కించేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌కు రెండు క్రేన్‌లను పోలీసు శాఖ ఏర్పాటు చేస్తుంది.

- ముషీరాబాద్ సీఐ రాంబాబు

ట్రాఫిక్ మళ్లింపు

నిమజ్జనం రోజు వీఎస్టీ నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వైపుగల నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జి, తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై రాకపోకలను నిషేధించాం. ముషీరాబాద్ చౌరస్తా నుంచి వైస్రాయ్ వరకు సింగిల్ వే, ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి ఇందిరాపార్కు వైపు సింగిల్‌వేకు మాత్రమే అనుమతి ఉంది. భారీ విగ్రహాల వాహనాన్ని ముషీరాబాద్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ మీదుగా వెళ్లే విధంగా ఏర్పాటు చేశాం. నిమజ్జనాన్ని తిలకించేందుకు వచ్చే వారు తమ వాహనాలను ఎన్టీఆర్ స్టేడియంలో పార్క్ చేయాలి.

- వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ

రోడ్లపై గుంతలను పూడ్చివేశాం



వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించే మార్గాల్లో రోడ్లపై గుంతలను పూడ్చివేశాం. విగ్రహాలకు అడ్డుగా వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేశాం. విద్యుత్ వైర్లను ట్రాన్స్‌కో అధికారుల ద్వారా అడ్డు లేకుండా చర్యలు తీసుకున్నాం. నిమజ్జనం రోజున జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- మహ్మద్ ఖాదర్ మొయినుద్దీన్, ముషీరాబాద్ డీఎంసీ

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

వినాయక నిమజ్జనం సందర్భంగా ఆజామాబాద్ ట్రాన్స్‌కో డీఈ పరిధిలో ఈనెల 17 నుంచి 18వ తేదీ సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా సిబ్బంది అందుబాటులో ఉంటారు. ముగ్గురు డీఈలు, పదిమంది ఏఈలతోపాటు వందమందికి పైగా సిబ్బంది రౌండ్ ద క్లాక్ డ్యూటీలో ఉంటారు.

- కమల్‌కుమార్ ట్రాన్స్‌కో ఆజామాబాద్ డీఈ